

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శనివారం 16 మార్చి 2024

శుక్రవారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 36.0°C | కనిష్టం : 23.5°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	శనివారం	సా : 6.32 గం..
సహార్ :	ఆదివారం	ఉ : 5.01 గం..



హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, చిత్రంలో మంత్రి కొండా సురేఖ తదితరులు



- కాంగ్రెస్ గూటికి వరంగల్ ఎంపీ దయాకర్!
- మంత్రి సురేఖతో కలిసి సీఎం వద్దకు.. నేడు చేరికకు ఏర్పాట్లు
- హస్తం కండువా కప్పుకొనేందుకు తాటికొండ రాజయ్య విఫలయత్నాలు
- ఇప్పటికే ప్రధాని మోదీ సమక్షంలో బీజేపీలో చేరేందుకు సిద్ధమైన అరూరి రమేష్
- వరంగల్ టికెట్ కోసం పట్టుపడుతున్న కమ్యూనిస్టులు
- సీపీఐ అగ్రనేతలతో కలిసి ఏఐసీసీ నేతలపై ఒత్తిడి
- లోక్‌సభ ఎన్నికల వేళ ఉత్కంఠ రేపుతున్న పరిణామాలు

రాజకీయం రసవత్తరం

ఓరుగల్లులో వేగంగా మారుతున్న సమీకరణాలు

(వరంగల్-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓరుగల్లు రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు.. అధికారం కోల్పోయిన తర్వాత జరుగుతున్న పరిణామాల్లో తలోదారి చూసుకుంటున్నారు. ఎవరికివారు కాంగ్రెస్ లేదంటే బీజేపీలో చేరేందుకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలవడంతో ఆయన కాంగ్రెస్ చేరబోతున్నారన్నది స్పష్టమైంది. ఇప్పటికే వరంగల్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మోదీ సమక్షంలో బీజేపీలో చేరేందుకు సిద్ధమవయ్యారు. అలాగే మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య కూడా కారు దిగి.. హస్తం గూటికి చేరేందుకు నెలరోజులుగా ప్రయత్నాలు చేస్తున్న అవి ఫలించకపోతుండటంతో ఆయన మరోపార్టీ వైపు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇవన్నీ ఇలా ఉంటే వరంగల్ సీటుపై కన్నేసిన కామ్రేడ్లు.. పొత్తులో భాగంగా సీపీఐకి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద పట్టుబడుతున్నారు.

బీఆర్‌ఎస్‌కు ఝలక్ ఇచ్చిన పసునూరి

పార్లమెంట్ ఎన్నికల వేళ ఎంపీ పసునూరి దయాకర్ బీఆర్‌ఎస్‌కు షాక్ ఇచ్చారు. రెండు రోజులుగా జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖతో కలిసి పార్టీ మార్పుపై చర్చించిన ఆయన శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రి కొండా సురేఖతో కలిసి వెళ్లి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అయితే గతంలోనే రేవంత్ రెడ్డి, దయాకర్ ఎంపీలుగా కలిసి పనిచేయడంతో పాటు ఇద్దరూ కలిసి హైదరాబాద్ కళాశాలలో ఫైన్‌ఆర్ట్స్ కోర్సు చదివిన సాన్నిహిత్యం ఉంది.



ఈ క్రమంలో పసునూరి తన రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. ఇక ఆయన శనివారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండం గులాబీ పార్టీకి భారీ కుదుపన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత బీఆర్‌ఎస్ నుంచి మరోసారి ఎంపీ టికెట్ ఆశించిన దయాకర్.. తనకు కాకుంటే కనీసం ఉద్యమకారులకైనా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. కానీ అధినాయకత్వం అనుహ్యంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు టికెట్ కేటాయించింది. దీంతో పార్టీలో మాదిగలకు అన్యాయం జరుగుతోందన్న అసంతృప్తికి గురైన దయాకర్ పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇప్పటికే అరూరి లాంటి కీలక నేతలు పార్టీని వీడుతున్న వేళ.. సిట్టింగ్ ఎంపీ దయాకర్ కూడా కారు దిగుతుండటం గులాబీ నేతల్లో గుబులురేపుతోంది. మరోవైపు తమకే బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చినా.. పార్టీ తమను కాదని మరో నిర్ణయం తీసుకుందని ఉద్యమకారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే చర్చ పార్టీలో జరుగుతోంది.

కమలం గూటికి అరూరి..



బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పార్టీ మార్పు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. కొంతకాలంగా అరూరి బీజేపీలో చేరుతారనే ఊహాగానాలు వినిపించాయి. హైదరాబాద్‌లో అమిత్‌షాను కలిసి వచ్చిన అరూరి.. పార్టీ మారేందుకు ప్రయత్నించగా బీఆర్‌ఎస్ నేతలు ఆయన్ను బలవంతంగా హైదరాబాద్‌కు తరలించారు. కేసీఆర్ సమక్షంలో పార్టీ మారనని చెప్పినా.. బీజేపీలో చేరేందుకు అరూరి వేగంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయన ముఖ్య అనుచరులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు బిజీగా ఉండటంతో రమేష్ చేరిక వాయిదా పడ్డట్లు సమాచారం. శుక్ర, శనివారాల్లో పీఎం నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనలు ఉండటంతో ఆయన సమక్షంలో శనివారం కమలదళంలో చేరే అవకాశాలున్నాయి.

వరంగల్ సీటు కోసం సీపీఐ పట్టు

కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా వరంగల్ సీటును తమకు కేటాయించాలని కమ్యూనిస్టులు పట్టుబడుతున్నారు. బుధవారం వరంగల్ ఎంపీ సీటు అభ్యర్థిగా సీపీఐ ప్రతిపాదిస్తున్న బీఆర్.లెనిన్‌తో పాటు వరంగల్ సీపీఐ నేత శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే కూనంనేని, చాడ వెంకట్‌రెడ్డి, పార్థసారథి తదితర నేతలు ఢిల్లీకి వెళ్లారు. సీపీఐ అగ్రనేత డి.రాజాను కలిసి వరంగల్ ఎంపీ సీటు సీపీఐ కేటాయించేలా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో చర్చించాలని నిర్ణయించారు.




ఢిల్లీలో సీపీఐ జాతీయ కార్యదర్శి రాజాను కలిసిన బీఆర్ లెనిన్, సీపీఐ నేతలు

పొత్తులో భాగంగా ఖమ్మం లేదా వరంగల్ సీట్లలో ఏదో ఒకటి ఇవ్వాలని గతంలో విజ్ఞప్తి చేశారు. అయితే ఖమ్మం సీటు విషయంలో కాంగ్రెస్ విముఖంగా ఉండటంతో వరంగల్ సీటును సాధించేందుకు కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. శనివారం ఏఐసీసీ అగ్రనేతలతో వరంగల్ సీటుపై తాడోపేడో తేల్చుకునేందుకు కమ్యూనిస్టులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ సీటు కోసం 50మందికి పైగా ఆశావాహులు ఉండగా, తాజాగా సిట్టింగ్ ఎంపీ దయాకర్ కూడా టికెట్‌పై ఆశతోనే పార్టీలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ వరంగల్ సీటుపై పట్టుబడుతుండటం వరంగల్ రాజకీయాల్లో రాజకీయ వేడి రగులుతోంది.

తాటికొండ దారెటు..?



బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించిన మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య దారెటనే చర్చ జరుగుతోంది. ఫిబ్రవరి 3వ తేదీన బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన రాజయ్య.. అదేనెల 10వ తేదీన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు అప్పట్లో ప్రకటించారు. అయితే కాంగ్రెస్‌లో చేరేందుకు రాజయ్య చేస్తున్న ప్రయత్నాలకు గతంలో అయనపై వచ్చిన ఆరోపణలు అడ్డుపడుతున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షితో పాటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌తో పాటు కీలక నేతలను రాజయ్య కలిశారు. అయినా రాజయ్య చేరికకు అడ్డంకులు ఎదరువుతున్నాయని తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయంగా వెనుకబడే అవకాశాలుండటంతో త్వరితగతిన కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్నుత్న ఆయన అవి ఫలించకుంటే ఒకటి రెండు రోజుల్లో మరో పార్టీలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మరోపార్టీ నుంచి రాజయ్యకు ఆఫరు వచ్చినట్లుగా సమాచారం. లోక్‌సభ ఎన్నికల వేళ సీనియర్ నేత రాజయ్య రాజకీయ అడుగులు ఎటు వైపు అనే చర్చ జరుగుతోంది. మొత్తానికి శనివారం లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఓరుగల్లు రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి.



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

- ముగ్గురికి తీవ్ర, 8 మందికి స్వల్ప గాయాలు
- ప్రమాద సమయంలో బస్సులో 45 మంది
- భూపాలపల్లి సమీపంలో ఘటన
- అతివేగమే ప్రమాదానికి కారణం.. పరారీలో వ్యాను డ్రైవర్

ఆర్టీసీ బస్సు, వ్యాను ఢీ

కృష్ణకాలనీ(భూపాలపల్లి), మార్చి 15 : ఓ ఆర్టీసీ బస్సు, వ్యాను ఢీ కొన్న ఘటనలో మొత్తం 11 మందికి గాయాలైన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రం శివారులో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి డిపోనకు చెందిన బస్సు మహాముత్తారం మండలం కనుకునూరు నుంచి కాటారం వచ్చి.. అక్కడ భూపాలపల్లి, పరకాలకు వెళ్లే సుమారు 45 మంది ప్రయాణికులను ఎక్కించుకుని బయల్దేరింది. ఈ క్రమంలో మల్లంపల్లి క్రాస్ సమీపంలో భూపాలపల్లి వైపు నుంచి కాటారం వైపు వెళ్తున్న ఓ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోయినా 11 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారిలో ముగ్గురికి తీవ్రంగా, ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ సీటు నుంచి నాలుగు సీట్ల వరకు బస్సు ధ్వంసమైంది. అలాగే వ్యాన్ ముందు భాగం కూడా దెబ్బతింది. దీంతో ఇదే బస్సులో సురక్షితంగా ఉన్న ప్రయాణికులు తేరుకొని 108కు, పోలీసులకు సమాచారం అందించగా.. క్షతగాత్రులను భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన మంతెన లావణ్య, ఆత్కూరి సమ్మక్క

బస్సు ప్రయాణికుల్లోని కాటారం మండలం బొప్పారం గ్రామానికి చెందిన మంతెన లావణ్య, ఆదివారంపేటకు చెందిన ఆత్కూరి సమ్మక్క, పరకాలకు చెందిన మోహన్ గుప్తాకు తీవ్ర గాయాలయ్యాయి. కాటారానికి చెందిన దుర్గం రాజేశ్వరి, భూపాలపల్లి టీటూ క్వార్టర్స్‌కు చెందిన రత్నం సుజాత, గణపురం మండలం బస్వరాజుపల్లికి చెందిన జువ్వాడి లక్ష్మి, మహాముత్తారం మండలం ములుగుపల్లికి చెందిన వేముల సంధ్యారాణి, చెల్పూరుకు చెందిన అల్లూరి సమ్మయ్య, కాటారానికి చెందిన రాజయ్య, లక్ష్మి, బస్సు డ్రైవర్ శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి రెండు వాహనాలు అతివేగంగా రావడమే కారణమని తెలుస్తుండగా.. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ డీసీఎం వ్యాను డ్రైవర్ వెంటనే పరారయ్యాడు. పోలీసులు వాహనం నెంబరు ఆధారంగా ఆ వ్యాను మహాముత్తారం మండలం మహబూబ్‌పల్లికి చెందిన వారిదిగా గుర్తించి యజమానికి సమాచారమిచ్చారు. భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై పవన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకుని.. వంద పడకల ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మరోవైపు ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ మెరుగైన వైద్యం అందించేలా వైద్యులను అప్రమత్తం చేసి.. వారికందిస్తున్న సేవలను పర్యవేక్షిస్తున్నారు.

తాగునీటి సమస్య ఏర్పడితే చర్యలు

- కలెక్టర్ భవేష్ మిశ్రా



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 15 : వేసవిలో మంచి నీటి ఎద్దడి ఏర్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను హెచ్చరించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో మంచినీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెకర్ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పల్లెల్లో మంచినీటి సమస్య ఉత్పన్నం అయితే యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బోరుబావులు, చేతి పంపులు, పైపులైన్ల లీకేజీ మరమ్మతులకు, నూతన పైపులైన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.91 కోట్లు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలను గుర్తించి నివేదిక అందించాలని ఎంపీడీవోలను ఆదేశించినప్పటికి కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మల్హార్‌రావు ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. శుక్రవారం వరకు 82 గ్రామాల నుంచి నివేదికలు అందలేదని, ఆయా పంచాయతీల కార్యదర్శులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యవేక్షించి నివేదికలు అందజేయాలని, తప్పుడు నివేదికలు అందించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. పాడైన వాటికి నామమాత్రపు మరమ్మతులు చేయొద్దన్నారు. అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ శబరీశ్

పస్రా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

గోవిందరావుపేట, మార్చి 15 : మండలంలోని పస్రా పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బంది వివరాలు, కేసులు నమోదు అవుతున్న తీరు, మావోయిస్టు సంబంధిత సమాచారం గురించి ఎస్సై కమలాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయన వెంట ములుగు డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ శంకర్, సిబ్బంది ఉన్నారు.



హాజరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మెరుగైన వైద్యం అందించాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ

మంగపేట, మార్చి 15 : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లాఅదనపు కలెక్టర్ పి.శ్రీజ వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యాధికారి వైశాలి విధుల్లో ఉండగా, ప్రతి నెలలో ఎన్ని సుఖప్రసవాలు జరుగుతున్నాయని తెలుసుకున్నారు. చిన్నారులకు అందించే వ్యాక్సిన్‌ను పరిశీలించి 5ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు, రోగుల విషయాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలిం చారు. సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. అత్యవర మందులను నిల్వ చేసుకోవాలన్నారు. మండలంలోని కమలాపురంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అందిస్తున్న సేవల గురించి మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ మౌనికను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలు ఎంత మంది విధుల్లో ఉన్నారన్నారు. గర్భిణులు, బాలింతలకు అందించే వైద్య సేవలగురించి సిబ్బందిని అడిగారు. కార్యక్రమంలో వైద్యాధికా రులు స్వప్నిత, పద్మ, సిరాజ్, ఫార్మాసిస్టుసంధ్య, స్టాఫ్‌నర్స్ త్రివేణి, ల్యాబ్ టెక్నీషియన్ లలితారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల టూరిస్టులను నమ్మొద్దు

- మానుకోట ఎంపీ మాలోత్ కవిత

బయ్యారం, మార్చి 15 : ప్రతిసారి ఎన్నికలు రాగానే టూరిస్టుల్లాగా వచ్చిపోయే నాయకులను నమ్మొద్దని మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ, పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కవిత అన్నారు. బయ్యారంలోని కోదండ రామచంద్ర స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు కష్టాలు కొనితెచ్చుకున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఇల్లందు మాజీ



మాట్లాడుతున్న ఎంపీ కవిత

ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, శ్రీకాంత్‌నాయక్, మమత, సత్యనారాయణ, మురళీకృష్ణ, శ్రీను, లక్ష్మణ్‌నాయక్, వెంకన్న, భద్రయ్య, ఐలయ్య, వీరభద్రం, గణేష్, శివాజీ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, మార్చి 15 : హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగులోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ హాల్‌లో శుక్రవారం ఏఎన్ఎంలు, డాటా మేనేజర్‌లతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ఆరోగ్య కార్యక్రమంలో అతి ముఖ్యమైన రిపోర్టింగ్ సాఫ్ట్‌వేర్ హెచ్ఎంఐఎస్‌ను అందరూ విధిగా నింపాలని, హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల ఏవిధమైన వివక్ష చూపకూడదని అన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి, హెచ్ఐవీ, ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ పోరిక రవీందర్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, జిల్లా ఆస్పత్రిలో ఐసీటీసీ ద్వారా హెచ్ఐవీ పరీక్షలు చేయడం జరుగుతుందని అన్నారు. పరీక్షలకు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, డెమో తిరుపతయ్య, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

సింగరేణిలో పెరుగుతున్న యువశక్తి

- భూపాలపల్లి ఏరియా జీఎం శ్రీనివాసరావు



నూతన ఉద్యోగులతో ఏరియా సింగరేణి అధికారులు

కాకతీయఖని, మార్చి 15 : సింగరేణి సంస్థలో రోజు రోజుకు యువశక్తి పెరుగుతోందని భూపాలపల్లి ఏరియా జీఎం శ్రీనివాసరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని జీఎం కార్యాలయంలో శుక్రవారం 13 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని కోరారు. అంకితభావంతో పనిచేసి తల్లిదండ్రులకు, సింగరేణి సంస్థకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటయ్య, రామకృష్ణ, తుకారాం, రవికుమార్, సురేఖ, రాజు, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి
- చెకుముకి రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులందిస్తున్న ప్రతినిధులు

కాటారం, మార్చి 15 : నిత్య జీవితంలో సైన్స్ విజ్ఞానాన్ని అనువర్తింపజేసుకోవాలని, మూఢ నమ్మకాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి అన్నారు. కాటారంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 2022-23 సంవత్సరానికి నిర్వహించిన చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలైన గురుకుల విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం శుక్రవారం నిర్వహించారు. పలువురు నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్లు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యులు, సైన్స్, టెక్నాలజీ విభాగం ప్రతినిధులు హాజరైన కార్యక్రమానికి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా అంగ్ల మాధ్యమంలో మండల స్థాయి నుంచి మొదలుకుని రాష్ట్ర స్థాయి పోటీల్లో మారుమూల ప్రాంతానికి చెందిన కాటారం గురుకులం గిరిపుత్రులు విజేతలుగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ ఉమామహేశ్వర్, డాక్టర్ రాములు, రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా ఆలోచించి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. వేసవి కాలంలో కూల్‌డ్రింక్స్ సేవించడం ఆరోగ్యానికి హానికరమని, వాటికి బదులుగా సహజ పండ్ల రసాలు తాగాలన్నారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విజేతలైన విద్యార్థులు హరిప్రసాద్, యాకూబ్, వరుణ్‌హార్దిక్‌లకు సర్టిఫికెట్లు అందించారు. గురుకులానికి మైక్రోస్కోప్, ఫిజిక్స్, బయాలజీ కిట్స్‌ను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ బుచ్చయ్య, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ఉపాధ్యాయులు నర్సింగ్, కిరణ్, శ్రీకాంత్, వినీత్, చెకుముకి జిల్లా ప్రతినిధులు సాంబయ్య, రాజు, కుమార్, సైన్స్ టీచర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

సీపీకి ఫిర్యాదు చేసిన వినయభాస్కర్



సీపీకి ఫిర్యాదు చేస్తున్న వినయభాస్కర్ తదితరులు

రాంనగర్, మార్చి 15: బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వినయభాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ తదితరులతో కలిసి సీపీని కలిశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత ప్రభుత్వం వేసిన శిలాఫలకం, ఇటీవల వడ్డేపల్లి ముదిరాజ్‌వాడలో శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై కొందరు కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిపై చర్య తీసుకోవాలని వినయభాస్కర్ పోలీస్ కమిషనర్‌ను కోరారు.



అదనపు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతక కార్యవర్గం

బల్దియా ఔట్‌సోర్సింగ్
డ్రైవర్ల సంఘం ఎన్నిక

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు శుక్రవారం బల్దియా కార్యాలయం ఆవణలో జరిగాయి. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్ పర్యవేక్షణలో ఈఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మేకల దేవేందర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నాగుల శ్రీకాంత్, కోశాధికారిగా దొడ్డిపాటి రాజేందర్, ఉపాధ్యక్షులుగా కొత్తపెల్లి కుమార్, కేతిరి పైడయ్య, కార్యదర్శిగా ఉసిల్ల ఆనందరావు, ప్రచార కార్యదర్శిగా పైనాల క్రాంతికుమార్, గుంజ రవి ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎన్నికల పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ప్రమాణం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు మున్సిపల్ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వార నూతన కమిటీని అబినందించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం రవియాదవ్, ఐలయ్య, బైరబోయిన గట్టయ్య అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.



కొత్తపల్లిలో బావిలో నుంచి పునుగు పిల్లిని బయటకు తీస్తున్న అటవీ శాఖ అధికారులు

కొత్తపల్లిలో బావిలో పడిన అరుదైన పిల్లి

భీమదేవరపల్లి, మార్చి 15: భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నిమ్మ రాజిరెడ్డి అనే రైతు వ్యవసాయ బావిలో అరుదైన పిల్లి పడింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన రేణుకుంట్ల రాజు, గ్రామస్తులతో పాటు హనుమకొండ అటవీశాఖ అధికారులకు తెలియజేశాడు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం అటవీశాఖ అధికారులు, అటవీ శాఖ రిస్క్ టీమ్ బృందం స్పందించి బావిలో దిగి అరుదైన పిల్లిని బంధించారు. అనంతరం హనుమకొండ జూపార్క్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంగా ఉన్నట్లయితే తిరుపతి జూపార్క్‌కు తరలిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ పిల్లిని పునుగు పిల్లిగా భావిస్తున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తిరుమల తిరుపతి అడవుల్లో ఎక్కువగా ఈ పునుగు పిల్లిలు సంచరిస్తాయని తెలిపారు.

అమ్మవారిపేట చెరువుకు

రామ్‌సర్ సైట్ హోదా

ఆ దిశగా పడుతున్న అడుగులు.. మొదలైన ప్రయత్నాలు

త్వరలో సందర్శించనున్న జీవవైవిధ్య నిపుణుల బృందం

రామ్‌సర్ సైట్ హోదాతో చెరువుకు అంతర్జాతీయ గుర్తింపు

హనుమకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అనేక అరుదైన పక్షులకు ఆవాసమైన వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట చెరువుకు త్వరలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రామ్‌సర్ సైట్ హోదా లభించనున్నది. ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా రామ్‌సర్ సైట్ జీవవైవిధ్య నిపుణుల బృందం అమ్మవారిపేట చెరువును సందర్శించేందుకు రానున్నది. కొద్ది రోజుల కిందటే ఈ బృందం రావలిసి ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల సందర్శన వాయిదా పడింది.

150కిపైగా పక్షులు

అమ్మవారిపేట చెరువు, దాని పరిసర ప్రాంతాల్లో అత్యంత అరుదైన, అంతరించిపోతున్న జాతులకు చెందిన, అలాగే పలు ఇతర దేశాలకు చెందిన 150 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. వీటిలో 50 శాతం పక్షులు ఇతర దేశాల నుంచి వలస వచ్చిన పక్షులే. అన్ని రకాల పక్షులు ఒక చెరువును ఆవాసంగా చేసుకొని ఉండడం అరుదు. ఆ ఘనత అమ్మవారిపేట చెరువుకు దక్కుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి జీవవైవిధ్యం కలిగిన చెరువు లేదు. ఒకప్పుడు పాకాల సరస్సుకు ఈ ప్రత్యేకత ఉండేది. కానీ ఇప్పుడు అక్కడ అంతగా లేదు. అమ్మవారిపేట చెరువుకు వలస పక్షులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం ఇటీవల కాలంలో పెరిగింది. ఇందుకు అనువైన వాతావరణం ఉండడం ఒక కారణం.

నిపుణుల బృందం రాక

అమ్మవారిపేట చెరువు విశిష్టతను గుర్తించిన రామ్‌సర్‌సైట్ దీనిపై దృష్టి సారించింది. పలువురు పక్షి ప్రేమికులు, వన్యప్రాణుల అభిమానులు చెరువు విశిష్టతను తెలియచేసే ఛాయాచిత్రాలతో డాక్యుమెంటేషన్ చేశారు. సమగ్ర సమాచారంతో నివేదికను రూపొందించారు. ఈ రెండింటిని రామ్‌సర్‌సైట్‌కు పంపించారు. వీటిని పరిశీలించిన ఈ సంస్థ చెరువు, దానిని అవాసంగా చేసుకున్న వివిధ రకాల పక్షులు, పరిసరాలు తదితర అంశాలను అధ్యయనం చేయడానికి ఒక నిపుణుల బృందాన్ని పంపాలని నిర్ణయించుకున్నది. నల్లగొండ జిల్లాకు చెందిన గుజ్జ బిక్షం ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఆయన చొరవతోనే అమ్మవారిపేట చెరువు రాంసర్ సైట్ జాబితాలో చేర్చే ప్రతిపాదన పరిశీలనకు వచ్చినట్టు సమాచారం.

రామ్‌సర్ సైట్ అంటే ఏమిటీ?

రామ్‌సర్ సైట్ అనేది చిత్తడి నేలల పరిరక్షణకు సంబంధించి అంతర్జాతీయ సహకారాన్ని అందించే ఒక వ్యవస్థ. ది కన్వెన్షన్ ఆఫ్ వెట్ ల్యాండ్స్ అని కూడా దీనిని పిలుస్తారు. యునెస్కో ఆధ్వర్యంలో ఇరాన్‌లోని రామ్‌సర్‌లో 1971 ఫిబ్రవరి 2న నిర్వహించిన ఒక సదస్సులో చిత్తడి నేలల సంరక్షణకు అంతర్జాతీయ సహకారాన్ని అందించేందుకు అంగీకరిస్తూ వివిధ దేశాలు సంతకాలు చేసిన ఒక ఒప్పందం. రామ్‌సర్‌లో ఈ ఒప్పందం కుదిరినందు వల్ల దీనికి రామ్‌సర్ సైట్ కన్వెన్షన్ అని కూడా పిలుస్తారు. రామ్‌సర్ సైట్ అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన చిత్తడి నేలలను గుర్తించడమే కాకుండా ప్రధానంగా నీటి పక్షుల (వాటర్ బర్డ్) ఆవాసాలను పరిరక్షించేందుకు తోడ్పాటును అందిస్తుంది. రామ్‌సర్ సైట్ ఏదైనా పక్షుల ఆవాసాన్ని గుర్తిస్తే దానికి రామ్‌సర్ సైట్ అని పేరుపెడతారు. ప్రపంచ వ్యాప్తంగా 2500 రామ్‌సర్ సైట్‌లు ఉన్నాయి. భారత దేశంలో 82 వరకు గుర్తించారు. ఏపిలో కొల్లేరు సరస్సుకు ఈ హోదా దక్కింది. తెలంగాణలో ఇప్పటి వరకు ఏ ఆవాసానికి ఈ గుర్తింపు రాలేదు. అమ్మవారిపేట చెరువుకు దక్కితే తెలంగాణలో రామ్‌సర్‌సైట్‌గా గుర్తింపు పొందిన మొదటి ఆవాసం ఇదే అవుతుంది. రామ్‌సర్‌సైట్‌గా గుర్తించడానికి తొమ్మిది అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో ఏ ఒక్క ప్రమాణం పరిధిలోకి పక్షుల ఆవాసం వచ్చినా దానికి రామ్‌సర్ సైట్ గుర్తింపు వస్తుంది. అరుదైన లేదా ప్రత్యేకమైన చిత్తడినేల కలిగి ఉండడం, అంతరించిపోతున్న లేదా తీవ్రంగా అంతరించిపోతున్న పక్షి జాతులు కలిగిన ప్రాంతమై ఉండడం, నిర్దిష్టమైన జీవభౌగోళిక ప్రాంతమై అందులో జీవవైవిధ్యం కలిగిన మొక్క లేదా జంతు జాలం ఉండడం, పక్షులు, జంతుజాలాలు జీవిత చక్రాలలో క్లిష్టమైన దశను, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఉండడం, ఒకే ప్రాంతంలో 20వేలు అంతకన్నా ఎక్కువ నీటి పక్షులు కలిగిన అవాసమై ఉండడం, ప్రపంచ జీవవైవిధ్యానికి దోహదపడే ప్రాంతమై ఉండడం, వలసమార్గంలో పక్షులకు అనువైనా ఆవాసంగా ఉండడం, చిత్తడి నేలపై ఆధారపడిన నాన్ ఏవియన్ జంతు జాతుల జనాభలో కనీసం ఒక శాతమైన పరిక్షించే అవకాశం కలిగి ఉండడం ఈ ప్రమాణాల్లో ఉన్నాయి. రామ్‌సర్ సైట్‌లో గుర్తించే పక్షుల ఆవాస ప్రాంతాలను మూడు రకాలుగా వర్గీకరించారు. ఒకటి సముద్ర తీర చిత్తడి నేలలు, రెండవది లోతట్టు చిత్తడి నేలలు, మూడవది మానవ నిర్మిత చిత్తడి నేలలు. ఈ మూడవ కేటగిరి కిందికి అమ్మవారిపేట చెరువు వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు సరస్సునను 2002 ఆగస్టు 19న రామ్‌సర్‌సైట్ జాబితాలో చేరింది.

భారీగా నిధులు

రామ్‌సర్ సైట్ జాబితాలోకి అమ్మవారిపేట చెరువు చేరిన పక్షంలో చెరువు, దానిని ఆవాసంగా చేసుకొని జీవిస్తున్న జంతుజాలాలు, ముఖ్యంగా నీటి పక్షుల సంరక్షణకు భారీగా నిధులు అందుతాయి. రామ్‌సర్ కన్వెన్షన్ బర్డ్‌లైఫ్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) అనే ఈ సంస్థకు వెట్‌ల్యాండ్స్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యుఎంఐ), డబ్లుడబ్ల్యుఎఫ్ ఇంటర్నేషనల్, వైల్డ్‌పౌల్, వెట్ ల్యాండ్స్ ట్రస్ట్ (డబ్ల్యుడబ్ల్యుటీ) వంటి ఏజెన్సీల భాగస్వామ్యంతో పని చేస్తుంది. అమ్మవారిపేట చెరువు ఒక సారి ఈ సైట్‌హోదా లభిస్తే ఆ మొత్తం ప్రాంతం రామ్‌సర్ తన ఆధీనంలోకి తీసుకుంటుంది. నీటి పక్షులు సంరక్షణ ప్రాంతంగా ప్రకటిస్తుంది. ఆ ప్రాంతాన్నంతా పక్షులకు మరింత అనుకూలమైన ఆవాసంగా తీర్చిదిద్దుతుంది. పక్షలు వేటను నిషేధిస్తుంది. మానవ సంచారాన్ని పరిమితం చేస్తుంది. చుట్టు పక్కల క్వారీలను నిషేధిస్తుంది. చిత్తడినేల స్వభావాన్ని సంరక్షిస్తుంది. చెరువు, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో నిర్మాణాలు, తవ్వకాలను కూడా నిసేధిస్తుంది. చెరువు సంరక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తుంది. జీవవైవిధ్య నిపుణుల పర్యవేక్షణ, అధ్యయనం, పక్షులు వలసలు, అరుదైన పక్షుల రాక, గుర్తింపు నిరంతర ప్రక్రియగా ఉంటుంది.

విద్యకు వెలుగు



- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్
- సర్కారు చదువులకు చేయూత
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,689 విద్యాలయాలకు ఉచిత విద్యుత్
- డిజిటల్ విద్య, పాఠశాల నిర్వహణకు ఊతం
- సర్వీస్ పర్సన్ల నియామకంతో బడుల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 15: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఇక నుంచి జీవో విద్యుత్ బిల్లులే రానున్నాయి. ఆదివారం నాడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమిస్తామని చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు కలిపి మొత్తం 3,689 విద్యాసంస్థలు ఇకపై విద్యుత్‌బిల్లులు చెల్లించాల్సిన పనిలేదు. విద్యుత్ బిల్లు కోసం ఇంతకు ముందు వినియోగించుకున్న పాఠశాల నిర్వహణ నిధులు ఇతర అవసరాలకు మళ్లించుకొనే అవకాశం లభించినట్లయ్యింది. ఇక కరోనా తర్వాత పాఠశాలల్లో పారిశుధ్యం పడకేసింది. పాఠశాలల్లో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సిబ్బంది లేకపోవడంతో దుర్భరమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రభుత్వం డిజిటల్ విద్య ప్రవేశపెట్టిన నేపథ్యంలో బడులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తే డిజిటల్ విద్యకు ఊతమివ్వడమే కాకుండా పాఠశాల నిర్వహణ డిజిటల్ విధానంలో మరింత సులువయ్యే అవకాశం పెరుగుతుంది.

డిజిటల్ విద్య, పాఠశాల నిర్వహణకు ఊతం

పాఠశాలల్లో ఉచిత విద్యుత్ సౌకర్యంతో ఇప్పటికే పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ విద్యకు ఊతమిచ్చినట్లు అవుతోంది. విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమయ్యేందుకు గత ప్రభుత్వం ఐఎఫ్‌బీ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసింది. అంతకు ముందు కొన్ని పాఠశాలల్లో ప్రొజెక్టర్ డిజిటల్ విద్యాబోధన పరికరాలను ఏర్పాటు చేసింది. అయితే పాఠశాలల్లో వీటి వాడకాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్ధేశిత సమయాల్లో మాత్రమే ఉపయోగిస్తున్నారు. పాఠశాల నిర్వహణ నిధులు రాక, కరెంట్ బిల్లులు చెల్లించలేక కొన్నిచోట్ల డిజిటల్ విద్యకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇక నుంచి ప్రభుత్వం అందించనున్న ఉచిత విద్యుత్ సౌకర్యంతో పాఠశాలల్లో నిరంతరంగా డిజిటల్ పాఠ్యాంశాలు కొనసాగనున్నాయి. కరోనా అనంతరం పాఠశాల నిర్వహణ డిజిటలైజేషన్ అయ్యింది. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, మధ్యాహ్న భోజన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారానే పంపిస్తున్నారు. ఇక ముందు నుంచి ఎలాంటి అవాంతరాలు లేకుండా పాఠశాల నిర్వహణ పనులు చేసుకోవచ్చును.

పాఠశాలల్లో మెరుగుపడనున్న పారిశుధ్యం

పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమిస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనతో పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుపడనున్నది. కరోనా అనంతరం పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లు కరువైనారు. దీంతో పాఠశాలల్లో పారిశుధ్యం పడకేసింది. కొన్ని పాఠశాలలకు వచ్చే నిర్వహణ నిధులు (కాంటింజెంట్ బిల్లుల)తోనే ప్రైవేటు వ్యక్తులకు నియమించుకొని తాత్కాలింగా పాఠశాలల ఆవరణలను శుభ్రం చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు లేరు. అక్కడక్కడ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చొరవతో మాత్రమే కాంటింజెంటి వర్కర్లు పని చేస్తున్నారు. గత ప్రభుత్వం సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామపంచాయితీల సిబ్బందితో పాఠశాలలను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ అది సాధ్యం కాలేదు. దాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించి పాఠశాలల్లో పారిశుధ్య పనులను మెరుగు పరిచేందుకు పూనుకుంది.

ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు

సమావేశంలో ముఖ్యమంత్రి మరో కీలక ప్రకటన చేశారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అరకొర వసతులతో నడుస్తోన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇక నుంచి పూర్తి స్థాయిలో వసతులు సమకూరనున్నాయి. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన పూర్తి స్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో అవసరమైన వసతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామని వారు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రస్తుత వరంగల్ జిల్లాలో 740 పాఠశాలలకు ఉచిత విద్యుత్ సదుపాయం అందనుంది. హనుమకొండ జిల్లాలో 535, మహబూబాబాద్ జిల్లాలో 898, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 432, జనగామ జిల్లాలో 473, ములుగు జిల్లాలో 453 పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనుంది. వీటితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల్లో, 16 మైనారిటీ గురుకులాల్లో, 22 ఎస్సీ, 36 ఎస్టీ గురుకులాలతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 49 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సైతం ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించనుంది.

జిల్లా	ప్రైమరీ	యూపీఎస్	హైస్కూల్స్	జూ.కళాశాలలు
వరంగల్	493	87	160	11
హనుమకొండ	318	72	145	9
మహబూబాబాద్	676	120	102	10
భూపాలపల్లి	319	44	69	5
జనగామ	297	64	113	7
ములుగు	366	46	41	7

రుద్రమ దశాబ్ది వార్షిక సమావేశాలు

- రేపు ఐదు గ్రంథాల అవిష్కరణ
- ఘనంగా జరగనున్న సాహిత్య సభలు

హనుమకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రుద్రమ వార్షిక సమావేశాలు ఆదివారం హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతాయని ప్రముఖ కవియిత్రులు, రచయిత్రులు అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మిలు తెలిపారు. ఈ సందర్భంగా రుద్రమ ప్రచురణలకు చెందిన ఐదు గ్రంథాల ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. గ్రంథావిష్కర్తలుగా కథా, నవలా రచయితలు అంపశయ్య నవీన్, బీవీఎన్ స్వామి, తిరునగరి దేవకీదేవి, వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావులు ఈ సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. గ్రంథ పరిచయకర్తలుగా మెట్టు రవీందర్, తెన్నేటి విజయ చంద్ర, సింగరాజు రమాదేవి, జి.చంద్రకళ, పి.మాలతీ పాల్గొంటారని తెలిపారు. సౌహార్ద సందేశకులుగా నాగిళ్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, పి.చంద్, శ్రీ రంగస్వామి, వల్లంపట్ల, పల్లేరు వీరస్వామి, నిధి, బి.రమాదేవి, బిల్ల మహేందర్ హాజరవుతారన్నారు. వివిధ సమావేశాలకు సమన్వయకర్తలుగా బండారి సుజాత, బిట్ల అంజనీదేవి, మరాడి శ్యామల, కొలిపాక శోభారాణి, మదూరి అనిత వ్యవహరిస్తారని చెప్పారు. సభలకు అధ్యక్షత, నిర్వహణలు అనిశెట్టి రజిత, కొమ్మరాజు రామలక్ష్మిలు నిర్వహిస్తారు. ఓరుగల్లు సాహిత్య సంరంభానికి సాహితీవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులందరిని ఆహ్వానిస్తున్నట్టు వారు తెలిపారు. దక్షిణభారత దేశపు మొట్ట మొదటి మహిళా పరిపాలకురాలైన కాకతీ రుద్రమ పేరున దశాబ్దం కిందట ప్రారంభించిన రుద్రణ ప్రచురణలు ఇప్పటి వరకు 15 గ్రంథాలను ప్రచురించిందని తెలిపారు.

మానుకోట లోక్‌సభ బరిలో ఆదివాసీ నేత

స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ పోటీ

ఆదివాసీల ఓట్లే తుడుందెబ్బ అధ్యక్షుడి లక్ష్యం



కొత్తగూడ, మార్చి 15: తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదివాసీ విద్యావంతుడు మైపతి అరుణ్‌కుమార్ మానుకోట లోక్‌సభ నియోజకవర్గ బరిలో నిలుచోనున్నాడు. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులుగా లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వారిని నిలబెట్టారు. ఆదివాసీల తరపున గత లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ అరుణ్‌కుమార్.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో నిలబడనున్నారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కామారం గ్రామంలోని ఆదివాసీ వ్యవసాయ కుటుంబానికి చెందిన జగన్నాథరావు - సుగుణ దంపతుల రెండో కుమారుడు మైపతి అరుణ్‌కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాల్లో విద్యను అభ్యసించాడు. కాకతీయ యూనివర్శిటీలో ప్రభుత్వ పరిపాలన శాస్త్రంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ 5, 6 షెడ్యూల్డ్ ఏరియాలపై పీహెచ్‌డీని పూర్తిచేశారు. ఆదివాసీ హక్కుల పోరాటం సమితి (తుడుందెబ్బ) సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఆదివాసీ హక్కులు, చట్టాలపై చేసిన పోరాటాల్లో, ఉద్యమాల్లో, పాదయాత్రల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడిగా పోరాటాలు చేస్తున్నాడు.

కాగా, పార్లమెంటరీ విధానం ద్వారానే ఆదివాసీ హక్కులు, చట్టాల అమలు సాధ్యమవుతుందని గ్రహించిన అరుణ్‌కుమార్.. ఆదివాసీల ఓట్లు అధికంగా ఉన్న మానుకోట లోక్‌సభ నియోజకవర్గంలో గత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. 57,073 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల స్ఫూర్తితో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బరిలో పోటీ చేయనున్నారు. మానుకోట లోక్‌సభ పరిధిలో అత్యధికంగా ఉన్న ఆదివాసీ ఓటర్లను ఏకంచేసి గెలుపు సాధించేందుకు అరుణ్‌కుమార్ వ్యూహరచన చేస్తున్నాడు.

నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన సువర్ణ



ఉద్యోగ నియామకపత్రం అందుకుంటున్న సువర్ణ

పర్వతగిరి, మార్చి 15: ఒక ప్రభుత్వ ఉద్యోగానికే నానా తంటాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో ఒక గృహిణి కష్టపడి ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన పూజారి సువర్ణ ఎంఏ బీఈడీ చదివి తెలంగాణ గురుకుల ఉపాధ్యాయురాలు (టీజీటీ), పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉపాధ్యాయురాలు(పీజీటీ), గురుకుల జూనియర్ లెక్చరర్(జేఎల్) పోస్టులకు ఆగస్టు 2023 లో అప్పటి ప్రభుత్వం పరీక్షలు నిర్వహించగా పరీక్షలు రాసింది. కాగా, మార్చి 2024లో ఆయా పోస్టులకు చెందిన ఫలితాలు రావడంతో వరుసగా టీజీటీ, పీజీటీ, జేఎల్ మూడు పోస్టులకు ఎంపికైంది. వీటితో పాటు డీఎస్సీ 2008లో కూడా అర్హత సాధించినా.. కోర్టు కేసు వల్ల జాప్యం నెలకొంది. ఇటీవల కోర్టు పరిష్కారం సూచించడంతో అందులోనూ ఉద్యోగం సాధించడంతో ఏకంగా నాలుగు ఉద్యోగాలు కైవసం చేసుకుంది. గృహిణిగా ఉంటూ తన భర్త పూజారి సురేష్ సహకారంతో తాను నాలుగు ఉద్యోగాలు సాధించినట్లు శుక్రవారం ఆమె తెలిపారు. ప్రస్తుతం ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో టీజీటీ ఉద్యోగం కోసం నియామక పత్రం తీసుకోగా, ఇతర ఉద్యోగాల కోసం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో తనకు అనుకూలమైన ఉద్యోగంలో చేరే అవకాశాలు ఉన్నాయి.

తప్పుల తడకగా స్టాఫ్ నర్సు మెరిట్ లిస్ట్

తమ వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు అడ్డదారులు

వరంగల్ మెడికల్, మార్చి 15: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. మెరిట్ ప్రొవిజినల్ లిస్టులో తప్పుల తడకగా ఉంది. ఒకే కోర్సులో మార్కులు ఇష్టారాజ్యంగా వేశారు. ఓ అభ్యర్థికి 2000 గరిష్ట మార్కులకు గాను 2018 మార్కులు వచ్చినట్లు మెరిట్ లిస్టులో చూపారు. మరో అభ్యర్థికి 1999 మార్కులు వచ్చినట్లు ప్రకటించారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టు చూసి నిరుద్యోగ అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు నియామకాలన్నీ ప్రతీసారి వివాదంగానే మారుతున్నాయి. ఈసారి మాత్రం మార్కుల వింతతో తమ వారికి ఉద్యోగాలు ఇప్పించేందుకు భారీ ప్రయత్నాలకు తెరలేపారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి మెరిట్ లిస్టును సరిచేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. అదేవిధంగా కొందరు అభ్యర్థులు జిరాక్స్ కాపీలపై ఎక్కువ మార్కులు వేసి దరఖాస్తు చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఈ బాగోతం వెనుక కార్యాలయ ఉద్యోగులు కూడా ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

భట్టిని కలిసిన రామగళ్ల పరమేశ్వర్



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో రామగళ్ల పరమేశ్వర్

హనుమకొండ సిటీ, మార్చి 15: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ ఆశావహుడు డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో భట్టిని కలిసి లోక్‌సభ టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ జీవితం, సామాజిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను భట్టికి విక్రమార్కకు విన్నవించి టికెట్ ఇప్పించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

హనుమకొండ టౌన్, మార్చి 15: తాగుడుకు బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తిచెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం కాపువాడలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. నల్లాటి రవి ప్రైవేట్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడని, తాగుడు బానిసైన రవి ఒక్కోసారి వారం రోజులైనా ఇంటికి రాకపోయేవాడన్నారు. ఈనెల 14వ తేదీన రాత్రి ఇంటికి వచ్చిన రవి.. తెల్లారేసరికి ఇంట్లో నిచ్చెనకు ఉరి వేసుకుని కుటుంబసభ్యులకు కనిపించాడు. మృతుడి కుమారుడు సుమిత్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, రవికి కుమార్తె తోపాటు భార్య సునిత ఉంది.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ టౌన్, మార్చి 15: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, సిటిజన్ క్లబ్, మోక్షావిల్లాస్, న్యూశాయంపేట ఏరియాలో మధ్యాహ్నం 1నుంచి 4గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. వడ్డెపల్లి, వెస్ట్ సిటీ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు, సోమిడి, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, టేకులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

డిగ్రీ కోర్సుల సెమిస్టర్ ఫీజుల గడువు 30

కేయూ క్యాంపస్, మార్చి 15: కేయూ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ ఫీజులు చెల్లించుకునేందుకు మార్చి 30 వరకు గడువు ఉందని కేయూ పరీక్షలనియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, డాక్టర్ ఎం.తిరుమలదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 4వరకు ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు.

ఇల్లు విక్రయం పేరిట మోసం

కటకటాల పాలైన కానిస్టేబుల్ దంపతులు

వరంగల్ క్రైం, మార్చి 15: లేని ఆస్తులు ఉన్నట్లు చూపించి డబ్బులు తీసుకుని పలువురిని మోసం చేసిన ఎం.డి. ఖాసీం అనే హెడ్ కానిస్టేబుల్ కటకటాల పాలయ్యాడు. సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.డి. ఖాసీం.. తన భార్య సహీదాతో కలిసి గోపాల్‌పూర్, భద్రకాళి కాలనీలో ఒక ఇంటిని విక్రయిస్తామని ధర్మసాగర్ మండలం ముల్కపల్లికి చెందిన ఓదెల లక్ష్మీ వద్ద రూ.50వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. 2019లో డబ్బులు తీసుకున్న కానిస్టేబుల్ దంపతులు.. ఇంటి విషయం ప్రస్తావించినప్పుడు దాటవేస్తూ వస్తున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఇటీవల బాధితురాలు లక్ష్మీ కానిస్టేబుల్ దంపతులపై ప్రజావాణిలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు పిర్యాదు చేసింది. స్పందించిన కమిషనర్.. కానిస్టేబుల్ దంపతులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సుబేదారి సీఐని ఆదేశించారు. హెడ్ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మరో ఐదు కేసుల్లో బాధితుల నుంచి రూ.1కోటి 94లోల నగదు, 430గ్రాముల బంగారం తీసుకుని మోసం చేసినట్లు తేలింది. హనుమకొండ, మిల్స్‌కాలనీ, కాజీపేట, ధర్మసాగర్, సుబేదారి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు విచారణలో బహిర్గతమైంది. విచారణ అనంతరం గత రాత్రి హెడ్ కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

రైలింజన్‌లో సాంకేతిక లోపం

కాజీపేట, మార్చి 15: హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలింజన్‌కు శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తింది. కాజీపేట జంక్షన్‌నుంచి బయలుదేరి హసన్‌పర్తి రైల్వే స్టేషన్ దాటిన కొద్ది నిమిషాలకే రైలింజన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. ఇంజన్‌ను మరమ్మతులు చేసేందుకు రైల్వే అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడే ఉన్న మరో ఇంజన్ తెప్పించగా అది కూడా మొరాయించింది. దీంతో మరో ఇంజన్ తెప్పించి ఇంటర్‌సిటీ బోగీలకు తగిలించి పంపించారు. ఇందుకు సుమారు రెండుగంటలు పట్టింది. దీంతో సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ, చెన్నై నుంచి ఢిల్లీ వెళ్లే పలు రైళ్లను హసన్‌పర్తి రైల్వే స్టేషన్ సమీపంలో నిలిపివేశారు. ఇంటర్‌సిటీ రైలు వెళ్లిన తర్వాత మిగతా రైళ్లను పంపించారు. ఈ కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఇద్దరు సీఐ, ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 15: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలలో ఎస్.కరుణాకర్ టాస్క్‌ఫోర్స్ నుంచి మహిళా పోలీస్ స్టేషన్(సుబేదారి), ఎస్.వెంకట్రాం మహిళా పోలీస్ స్టేషన్ నుంచి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్ఐలలో బి.రామారావు హనుమకొండ నుంచి నల్లబెల్లి, ఎస్.నగేష్ నల్లబెల్లి నుంచి వీఆర్ బదిలీ అయ్యారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు

- పెండింగ్‌లో ఉన్న నెల రోజుల జీతం
- దయనీయ స్థితిలో శానిటేషన్ సిబ్బంది
- నూతన కమిషనర్ స్పందించాలని విజ్ఞప్తి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15 : వారు రెక్కాడితే గానీ డొక్కాడని పేద బడుగుజీవులు.. ఉదయం లేచి ప్రజలు ప్రశాంతంగా నడిచేందుకు రోడ్లను శుభ్రం చేసి చీపుర్లతో ఊడ్చి అద్దంగా దిద్దే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు.. కానీ వారికి సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్ వరంగల్ కార్యాలయంతో పాటు రెండు సర్కిల్ కార్యాలయాలు 12 సెంటర్లలలో సుమారు 3,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. చెత్త శుభ్రం చేయడం మొదలుకుని చెత్తను తరలించేవారు, ప్రైవేటు జవాన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, స్వీపర్లు, అటెండర్లు మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్నారు. వీరికి నెల జీతం వస్తే గానీ ఇళ్లు గడిచే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో గ్రేటర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతీ నెల 20 తేదీ నుంచి 20 వరకు నెల రోజులుగా గుర్తించి ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు విడుదల చేస్తారు. అయితే డిసెంబరు మాసంలో నిర్వహించిన విధులకు సంబంధించిన జీతం జనవరి 20న డ్రా చేసుకున్నారు. కానీ జనవరి నెల జీతం ఫిబ్రవరి 20 వరకు కాకుండా మార్చి నెల సగం గడిచిపోయినా అందలేదు. జీతం తీసుకునే సమయం దాటి 15 రోజులు ముగిసిన అధికారులలో చలనం లేదని మండిపడుతున్నారు. జీతం రాక గాసం లేక ఇబ్బందితో అయోమయానికి గురవుతున్నారు. కొందరు ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, చిల్లర సామాను, నెల వారి చిట్టీలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్టు చెప్పారు.

ఆలస్యం కావడంతో అందరికీ టెన్షన్

నెల దాటినా ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో అందరిలో ఆందోళన మొదలైంది. కార్మికులు తరుచుగా సెల్‌ఫోన్‌కు ఎప్పుడు మెస్సేజ్ వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఇంకా కొందరు సఫాయి కార్మికులు తరుచుగా బ్యాంకుల వద్దకు వెళ్లి తమ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయ? అని అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. జీతాలు రాకపోవడంతో కొందరికి ఆటోచార్జీలు లేక విధులకు గైర్హాజరు అవుతున్నట్టు చెప్పారు. అధికారులు స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అశ్విని వేతనాలపై దృష్టిసారించాలని కార్మికులు వేడుకుంటున్నారు.



తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

▸▸ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, మార్చి 15: వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ యార సుజాత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా రంగాపురం ఎంపీటీసీ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు నీళ్లు రావడం లేదని తెలిపారు. ఈవిషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. పిడిసిల్ల ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో వాగులు, కుంటలు, చెరువుల్లో నీళ్లు లేక వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయే పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. తక్షణమే ఎస్సారెస్పీ ద్వారా చెరువుల్లోకి నీటిని విడుదల చేసి కాపాడాలన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రతి సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నరేష్, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో జయశ్రీ, జడ్పీటీసీ జోరిక సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి దుద్దిళ్ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

కాటారం, మార్చి 15 : మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం, మంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మద్ది కమలామనోహర్, కోశాధికారి రవీందర్, ప్రతినిధులు అల్లాడి చంద్రమౌళి, శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, దారం నగేష్, నందకిషోర్, సదానందం, అనంతుల రమేష్‌బాబు, పవిత్రం శ్రీనివాస్, మద్ది సూర్యనారాయణ, ప్రకాష్, చిట్టూరి రవి, బాలచందర్, నాగేశ్వర్, ఎంపీటీసీ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉండొద్దు

▸▸ కలెక్టర్ ఇలా త్రిపాఠి ▸▸ అధికారులతో సమీక్ష



కలెక్టర్‌కు తమ వినతులను అందజేస్తున్న ప్రజలు

మంగపేట, మార్చి 15 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని గంపోనిగూడెం రైతు వేదికలో శుక్రవారం వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, విద్యుత్ సరఫరాపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ పి.శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలల పాటు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేకించి తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. పైపులైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటితో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమున్న చోట చేతిపంపులు, బోర్‌వెల్స్ ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. తల్లుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో దొరికే మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాస్, ఎస్‌ఈ మల్లేష్, ఈఈ కె.మల్లేష్, మణిక్యరావు, మండల ప్రత్యేకాధికారి తుల రవి, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినా, ఎంపీడీవో జి.కృష్ణప్రసాద్, తహసీల్దార్ భైరి వీరస్వామి, ఎంపీవోలు పాల్గొన్నారు. కాగా, బిల్ట్ రెగ్యులర్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని, శనిగకుంట గ్రామస్థులు తాగునీటి సమస్య తీర్చాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

వెంకటాపురం(నూగూరు), మార్చి 15 : మండల కేంద్రంలోని కొమరంభీం కాలనీకి చెందిన ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు గోండ్వాన సంక్షేమ పరిషత్ అండగా ఉండి పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కొమరంభీం కాలనీలో పూనెం సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలనీకి చెందిన పది ఆదివాసీ కుటుంబాలు 30 సంవత్సరాలుగా సమీపంలోని ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రతాప్, రమేష్, లోకేష్, రాజేష్, లక్ష్మయ్య, రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా డీఎస్పీ ఆవిర్భావ వేడుకలు

గణపురం, మార్చి 15: మండలంలోని బుద్దారం గ్రామ పంచాయతీలో ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే, అంబేద్కర్, సాహు మహరాజ్, కాన్షీరాం సిద్ధాంతాల కొనసాగింపుగా అగ్రకుల ప్రజాస్వామ్య వాదుల విముక్తి కోసం ధర్మసమాజ్ పార్టీని విశారదన్ మహారాజ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఎస్పీ 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అనంతరం కాన్షీరాం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కండె రవి, కోగిల జితేందర్, పొనగంటి సతీష్, నరసింహ, ఇంజపల్లి సాగర్, జగదీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభ్యంతరాలను తెలియజేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 15: ములుగు గ్రామంలోని సర్వేనంబర్ 837 ప్రభుత్వ భూమిలో ప్రతిపాదించిన సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణంలో ఆక్రమణలో ఉండి భూమి కోల్పోతున్న రైతుల్లో పరిహారం అందని వారు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిహారం పొందని మోఖాపై వ్యవసాయం చేస్తున్న రైతుల జాబితా తహసీల్దార్ కార్యాలయంలో ప్రచురించబడిందని, ఈ జాబితాలోని రైతుల యాజమాన్య వివరాలపై ఎవరికైనను ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే మూడు రోజుల్లో తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 15 : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల అక్రమ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ మండలంలోని ఆలుబాక-జెడ్‌లో అనేక మంది గిరిజనేతరులు అక్రమ పట్టాలు చేసుకున్నారని, వాటిపై అధికారులు విచారణ చేపట్టి పట్టాలను రద్దుచేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా భూముల క్రయవిక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణబాబు, నేత్రనందకుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఏఎస్పీగా గితే మహేష్ బాబాసాహెబ్



ఏటూరునాగారం రూరల్, మార్చి 15 : ఏటూరునాగారం నూతన ఏఎస్పీగా గితే మహేష్ బాబాసాహెబ్ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది గవర్నర్ ఏడీసీగా బదిలీపై వెళ్లారు. కాగా, ఆయన స్థానంలో 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గితే మహేష్ బాబాసాహెబ్‌ను ప్రభుత్వం ఏఎస్పీగా నియమించగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలి

భూపాలపల్లిటౌన్, మార్చి 15 : పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఆ గ్రామ విలేజ్ ఆర్గనైజర్లు ఉండడం జరుగుతుందని అన్నారు. ఒకవేళ ఒకరి కంటే ఎక్కువ మంది వీవోలు ఉంటే పాఠశాలకు సమీపంలో ఉన్న మహిళా సమైఖ్య వీవోను చైర్మన్‌గా ఎన్నుకోవాలని సూచించారు. కన్వీనర్‌గా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉండాలని చెప్పారు. అయితే ఈ కమిటీల బాధ్యత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, మధ్యాహ్న భోజన సౌకర్యం అమలు, యూనిఫాంలు, ఇతరాత్ర సౌకర్యాలు, విద్యార్థులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని చెప్పారు. అలాగే బ్యాంకు అకౌంట్ కూడా తీయాలని తెలిపారు.

తాగునీటి కోసం ఆందోళన



పట్టణంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న శాంతినగర్ వాసులు

భూపాలపల్లిటౌన్, మార్చి 15 : పట్టణంలోని శాంతినగర్ వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. శాంతినగర్ ప్రజలు కొద్ది రోజులుగా మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని తెలిపారు. ఈ విషయమై మునిసిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. రెండు రోజులకు ఒకసారి తక్కువ సమయం ఇవ్వడంతో నీరు సరిపోవడం లేదని తెలిపారు. పైగా ఓపెన్‌కాస్టు గని పక్కనే ఉండడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బోర్లు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. దీంతో దిక్కుతోచని స్థితిలో మునిసిపాలిటీ ఇచ్చే మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడి జీవనం గడుపుతున్నామని అన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలెక్టర్ భవేష్‌మిశ్రాకు చెప్పినప్పటికీ ఫలితం లేదని చెప్పారు. అధికారులు స్పందించి నీటిని రోజుకు గంటపాటు ఇవ్వకపోతే ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

సీసీరోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీదేవి

ములుగు కలెక్టరేట్, మార్చి 15 : ములుగు పట్టణంలోని వివిధ కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్ శుక్రవారం ప్రారంభించారు. రూ.6లక్షల నిధులతో జాతీయ రహదారి నుంచి అయ్యప్ప దేవాలయం వరకు, రూ.2లక్షల నిధులతో వీవర్స్‌కాలనీలో, బృందావనకాలనీ, పలు కాలనీల్లో రూ.14లక్షలతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతూ రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, నాయకులు జానమ్మ, గడ్డమీది భాస్కర్, తక్కళ్లపల్లి రామారావు, చింత రాజు, చిన్నరాజు, గణేష్, శ్రీను, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు ప్రూనింగ్ చేపట్టాలి

▸▸ సీపీఎం రాష్ట్ర నాయకుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఏటూరునాగారం, మార్చి 15: తునికాకు ప్రూనింగ్ వెంటనే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బందారి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం గ్యానం వాసు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రవికుమార్, సూడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో 97 యూనిట్లకు మాత్రమే ఇప్పటి వరకు టెండర్లు పూర్తయ్యాయని అన్నారు. మిగతా యూనిట్లకు ఇంతవరకు టెండర్లు కాలేదని, టెండర్లు పూర్తయిన చోట తునికాకు ప్రూనింగ్ చేపట్టలేదన్నారు. ములుగు జిల్లాలో గిరిజనులు, ఇతర కూలీలు వేసవి కాలం తునికాకు రెండవ పంటగా భావిస్తారన్నారు. ఒక కుటుంబం సుమారు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు తునికాకు ద్వారా ఆదాయం సమకూర్చుకుంటుందని పేర్కొన్నారు. ఎక్కడా ప్రూనింగ్ చేయకపోవడం వలన నాణ్యమైన తునికాకు రాదని తెలిపారు. వెంటనే కొమ్మ కొట్టాలని, టెండర్లు కాని యూనిట్లలో ప్రభుత్వమే ఆకు సేకరించాలని వారు డిమాండ్ చేశారు. టెండర్ కాని యూనిట్లకు అటవీశాఖ బాధ్యత వహించాలన్నారు. 50 ఆకుల తునికాకు కట్టకు రూ.4 చెల్లించాలన్నారు. తునికాకు బోనస్ రూ.200 కోట్లు విడుదలైనా నేటికి గ్రామాల్లోని కూలీలకు అందలేదని తెలిపారు. కూలీలకు వెంటనే బోనస్ చెల్లించాలని కోరారు. సమావేశంలో సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, కమిటీ సభ్యులు కొప్పుల రఘుపతి, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేష్, జాగటి చిన్న, కావిరి సుధాకర్, దుగ్గి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి : ఆర్డీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, మార్చి 15: వినియోగదారులు హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం శుక్రవారం కలెక్టరేట్‌లో జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు అనేక విషయాల్లో హక్కులు, చట్టాలపై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లాలోని వినియోగదారులు వస్తువుల క్రయ, విక్రయాలు చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తినా, మోసానికి గురైనా జిల్లా వినియోగదారుల ఫోరంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ మేనేజర్ రాంపతి, లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీలత, మార్కెటింగ్ శాఖ అధికారి సుచిత్ర, తహసీల్దార్ విజయభాస్కర్, డీసీఏపీ అధ్యక్షుడు మల్లయ్య, కోశాధికారి సంగ రంజిత్, జిల్లాలోని రేషన్ డీలర్లు, గ్యాస్ డీలర్లు, పెట్రోల్‌బంకు, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం జరగగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.సమ్మయ్య పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019 ప్రకారం వినియోగదారులకు లభించే హక్కులు, పొందే నష్టపరిహారం, వివిధ స్థాయిల్లో ఉన్న పరిష్కార మార్గాలను అనుసరించాలని అన్నారు. వస్తువులను కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎమ్డీ.యాకూబ్, ఉమాదేవి, వెంకన్న, మహేందర్, నాగమణి, అనిల్‌కుమార్, విజిత, శంకర్, తేజోలత, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుపు తాడే.. మూగజీవాల పాలిట ఉరితాడైంది

▸▸ పగ్గం బిగుసుకుని జోడెద్దులు మృత్యువాత



మృతి చెందిన జోడెద్దులు

కాటారం, మార్చి 15: ఎంత బరువునైనా అవలీలగా లాగే ఆ ఎద్దులు ఓ పలుపుతాడుకు బలయ్యాయి. పలుపు తాడే వాటి పాలిట ఉరితావడంతో మృత్యువాతపడ్డాయి. దీంతో సరైన దిగుబడులు రాకపోయినా ఆ ఎద్దులతో ఉన్న కొద్దిపాటి భూమిని దున్నుకుంటూ పంట పండించుకుంటూ, ఇతర రైతులకు వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్న ఓ పేద రైతు కుటుంబం ఆసరాను కోల్పోయి కన్నీరుమున్నీరవుతోంది. ఈ విషాద సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చింతకానిలో శుక్రవారం జరిగింది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... చింతకాని ఎస్సీ కాలనీకి చెందిన చకినాల తిరుపతికి ఒకటిన్నర ఎకరాల భూమి ఉండగా, రెండు ఎద్దులు కొనుక్కుని వ్యవసాయం చేస్తున్నాడు. తిరుపతికి భార్య ముగ్గురు కూతుళ్లు, ఒక్క కుమారుడున్నాడు. తనకున్న పొలంలో వరి సాగు చేస్తూ ఖాళీ సమయాల్లో ఇతర రైతులకు ఎడ్ల నాగలి దున్నుతూ వచ్చిన కూలీ డబ్బులతో ఆ ఎద్దులను, కుటుంబాన్ని సాకుతున్నాడు.

ఈ క్రమంలో గురువారం రాత్రి జోడెద్దులను పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లేసరికి రెండు ఎద్దుల గొంతులకు పలుపుతాడు బిగుసుకుని అవి చనిపోయి కనిపించాయి. దీంతో తిరుపతి కన్నీటి పర్యంతమయ్యాడు. రాత్రి సమయంలో ఆ ఎద్దులు బెదిరి ఉంటాయని, పరుగెత్తేందుకు ప్రయత్నించిన సమయంలో తాడు గొంతులకు బిగిసి మృతిచెంది ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. కుటుంబ ఆసరాను కోల్పోయిన నిరుపేద రైతు తిరుపతిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

చిట్యాల, మార్చి 15: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఐదు రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువులకు 100 శాతం టీకాలు వేయాలని వైద్యులకు సూచించారు. తొలి రోజు మండల వ్యాప్తంగా 410 పశువులకు టీకాలను వేసినట్లు చల్లగరిగ పశువైద్యాధికారి మహతి తెలిపారు. ఎంపీడీవో రామయ్య, ఏడీ వెంకన్న, ఎంపీవో రామకృష్ణ, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలు అమర్చితే చర్యలు

గోవిందరావుపేట, మార్చి 15: పంట పొలాలు, అడవుల్లో కరెంటు తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని మండలంలోని పస్రా ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు, వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడేందుకు కరెంటు తీగలు, ఉచ్చులు అమరుస్తున్నారని అన్నారు. దీంతో అభంశుభం తెలియని మనుషుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంట పొలాల వద్ద కరెంటు తీగలు పెట్టవద్దని, ఇందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

పీవోను కలిసిన టీడబ్ల్యుటీయూ నేతలు

ఏటూరునాగారం రూరల్, మార్చి 15: ఏటూరునాగారంలో ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాను గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం(టీడబ్ల్యుటీయూ) రాష్ట్ర నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి రాజు, ములుగు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కోటయ్య, రవి ఐటీడీఏ కార్యాలయానికి చేరుకొని పీవోను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రామచందర్, నాగేశ్వరరావు, సారంగపాణి, రేవతి, చంద్రకళ, శ్రీనివాస్, పాయం మీనయ్య, సమ్మయ్య, ప్రకాశ్, లత, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సాహితి మృతి కారకులను శిక్షించాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 15 : మండలంలోని ఆలుబాక గ్రామానికి చెందిన సాహితి మృతికి కారణమైన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్థులు ఆర్ అండ్ బీ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఇలాంటి అన్యాయం ఏ ఆడపిల్లకు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన రాస్తారోకోతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్, తహసీల్దార్ వీరభద్రప్రసాద్ సంఘటన వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి న్యాయం చేసేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంటు చేయాలి

భూపాలపల్లి టౌన్, మార్చి 15 : పారిశుధ్య కార్మికులను పర్మినెంటు చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొంపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డిపార్ట్‌మెంట్ల ఉద్యోగుల వేతనాలు ప్రతి నెల 1న వస్తే కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు మాత్రం వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా వారిని పర్మినెంటు చేసి ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రాజ్‌కుమార్, వక్షయ్య, నర్సయ్య, వెంకటయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూర్జువా పార్టీలను తరిమికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లింగయ్యదొర

ములుగు కలెక్టరేట్, మార్చి 15: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ బూర్జువా పార్టీలను తరిమికొట్టాలని జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ చందా లింగయ్యదొర, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలో జాయింట్ యాక్షన్ కమిటీ, తుడుందెబ్బ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అత్యధిక జనాభా కలిగిన ఆదివాసీలను విస్మరించి అత్యల్పంగా ఉన్న లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వారికి మహబూబాబాద్ ఎంపీ టికెట్ కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రచారం కోసం గూడాల్లోకి వచ్చే ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలను తరిమికొడతామని హెచ్చరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జాతీయ కన్వీనర్ పొదెం రత్నం, ఏఈడబ్ల్యూసీ గౌరవ అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్, గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ, వట్టం కన్నయ్య, చింత కృష్ణ, కొట్టెం రవి, వట్టం జనార్దన్, చందా మహేష్, పూనెం శ్రీను, ముద్దబోయిన రవి, వజ్జ నర్సింహారావు,చందా నాగేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



భూపాలపల్లిలో కేక్ కట్ చేసిన డీఎస్పీ నాయకులు

భూపాలపల్లిటౌన్, మార్చి 15 : భూపాలపల్లి పట్టణంలో కాన్షీరాం జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా నాయకుడు కొత్తూరి రవీందర్ మాట్లాడుతూ కాన్షీరాం రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న డీఎస్పీ అధినేత విశారదన్ మహారాజ్ తెలంగాణలో అధికారమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు దొమ్మాటి రవీందర్, చిట్యాల శ్రీనివాస్, బొజ్జపల్లి మహర్షి, ఓంకార్, రాజ్‌కుమార్, సాత్విక్, శశిప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

- చిట్యాల : అందరికీ ఆదర్శప్రాయుడు కాన్షీరాం అని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో పలు సంఘాల ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎస్ మండల ప్రధాన కార్యదర్శి మ్యాదరి సునీల్, కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు గూడెపు రజినీకాంత్, దాసారపు నరేష్, బానోత్ రాజునాయక్, కట్కూరి శ్రీనివాస్, గుర్రపు తిరుపతి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.
- కాటారం : మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం 90వ జయంతి వేడుకలను బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేష్, నియోజకవర్గ ఇంచార్జి అట్టెం రమేష్, జిల్లా కోశాధికారి కందుగుల రాజన్న ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కాన్షీరాం ఆశయ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు అమీన్, రామిళ్ల రజిత, అహ్మద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.